సాక్షి నిజామాబాద్

మంగళవారం ı 12 ı మార్చి ı 2024



ప్రజావాణికి 95 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 95 ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు అర్జీలు స్వీకరించారు.

- 8లో ▸





వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రంజాన్ మాసం షురూ..

నిజామాబాద్ సిటీ: పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు మొదలయ్యాయి. సోమవారం రాత్రి నెలవంక కనిపించటంతో మసీదుల్లో సైరన్లు మోగించి రంజాన్ మాసం ప్రారంభమైనట్లు మతపెద్దలు ప్రకటించారు. ఇటు మసీదులు, అటు వ్యాపార సంస్థలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. పలు హోటళ్లలో హలీం తయారీకి ఏర్పాట్లు చేసుకున్నారు.

భూమికి బదులు భూమి

- ఫారెస్టు శాఖకు 30 ఎకరాల కేటాయింపు

డొంకేశ్వర్(ఆర్మూర్): రోడ్డు వెడల్పు పనుల్లో భూమిని కోల్పోయిన అటవీ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం మరోచోట భూమిని కేటాయించింది. వర్ని నుంచి నస్రుల్లాబాద్ మీదుగా రుద్రూర్, ఎల్లారెడ్డి వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు నేషనల్ హైవే రోడ్డును వేస్తున్నారు. ఇందుకు రోడ్డు దూరాన్ని తగ్గించడానికి వర్ని వద్ద ఫారెస్టుకు చెందిన స్థలాన్ని ప్రభుత్వం తీసుకుంది. మొత్తం 12 హెక్టార్లకు పైగా ఫారెస్టు భూమిని కోల్పోయిన అటవీ శాఖకు నవీపేట్ మండలం మద్దెపల్లి వద్ద 30 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. స్థల కేటాయింపుపై త్వరలోనే ఉత్తర్వులు రానున్నట్లు ఫారెస్టు శాఖ అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ వైస్ చైర్మన్(ఇన్‌చార్జి చైర్మన్) షేక్ మున్ను అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. 2024–25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ మొత్తం రూ.19.06 కోట్లు అని తెలిపారు. మిగులు బడ్జెట్ 1/3 వ వంతు బ్యాలెన్స్ ద్వారా రూ. 79.98 లక్షలను(వీలిన గ్రామా ల కోసం) వార్డుల వారిగా కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, డీఈ భుమేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారడం లేదు

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



నిజామాబాద్ రూరల్: తాను బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఇటీవల కొన్ని చానళ్లలో వచ్చిన వార్తలు అవాస్తవమని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం వీడియో విడుదల చేశారు. తాను ఏ పార్టీలోకి వెళ్లడం లేదన్నారు. తనకు రాజకీయ భవిష్యత్ ఇచ్చిన బీఆర్‌ఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో వీడబోనని తేల్చి చెప్పారు. కొందరు కావాలనే తనపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తనకు ఎంపీ టికెట్ వచ్చినా రాకపోయినా పార్టీకి విధేయుడిగా ఉంటానని తెలిపారు. చివరి వరకు కేసీఆర్ వెంటే నడుస్తానని స్పష్టం చేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆర్మూర్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆర్మూర్ రూరల్, ఆలూర్ మండలాల బీజేపీ మండలస్థాయి కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరు సైనికులుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, జీవి నరసింహారెడ్డి, కంచెట్టి గంగాధర్, కలికోట గంగాధర్ పాల్గొన్నారు.

'కామారెడ్డి' చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీస్

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్‌కు చెందిన కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవికి షాక్ తగిలింది. సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించాలని 27 మంది సంతకాలు చేసి కలెక్టర్ జితేష్ పాటిల్‌కు అవిశ్వాసం నోటీసును అందజేశారు. కాంగ్రెస్ సభ్యుల వినతి మేరకు అవిశ్వాస ప్రక్రియ కోసం ఈ నెల చివరి వారంలో సమావేశం తేదీని ప్రకటించనున్నారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ జాహ్నవి బలపరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం అవిశ్వాసం నెగ్గేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

గతి తప్పిన వసతి గృహాలు



- బోధన్‌లోని బీసీ వసతి గృహంలో ఇటీవల తోటి విద్యార్థుల దాడిలో డిగ్రీ విద్యార్థి అసువులు బాసాడు. ఇక్కడ వసతి గృహం అధికారి అందుబాటులో లేకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు ఉన్నతాధికారులు నిర్ధారించారు. వార్డెన్‌ను సస్పెన్షన్ చేశారు. వాచ్‌మన్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ వసతి గృహంలో తరుచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు.

- నాలుగు నెలల క్రితం ఆర్మూర్‌లోని ఎస్సీ వసతి గృహంలో విద్యార్థినుల మధ్య గొడవ జరగడంతో ఓ విద్యార్థినికి తీవ్ర గాయలు కాగా ఆస్పత్రిలో చేర్పించారు. ఇదే వసతి గృహంలో మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది.

- పర్యవేక్షణ కరువే ప్రధాన లోపం
- అందుబాటులో ఉండని వార్డెన్‌లు
- తరుచూ విద్యార్థుల మధ్య గొడవలు
- వాచ్‌మన్‌లే నిర్వాహకులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో సరైన పర్యవేక్షణ లేని కారణంగా విద్యార్థుల మధ్య గొడవలు జరిగి అవాంఛనీయ ఘటనలకు దారితీస్తున్నాయి. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న విషాదాంతాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. వసతి గృహం అధికారులు అందుబాటులో లేకపోవడం.. ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతోనే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయని అంటున్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలలో గత కొంతకాలంగా అనిశ్చితి ఏర్పడింది.

- వసతి గృహాలలో వార్డెన్లు నిత్యం విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు వారి వసతికి సంబంధించిన పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అయితే వార్డెన్‌లు వసతి గృహాలకు సమయం కేటాయించడం లేదు. కొందరు వార్డెన్‌లు అయితే రోజుల తరబడి హాస్టల్ వైపు రావడం లేదు. హాస్టల్లోని వాచ్‌మన్‌లకు బాధ్యతలు అప్పగించి డుమ్మాలు కొడుతున్నారు.
- వసతి గృహాలలో వార్డెన్‌ల కొరత ఎక్కువగా ఉంది. ఒక్కో వార్డెన్ రెండు నుంచి మూడు వసతి గృహాలకు ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాలు 64 ఉండగా ఇందులో 14 వార్డెన్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. దీంతో వార్డెన్‌లు తమకు పోస్టింగ్ ఉన్న హాస్టల్‌కు కొంత సమయం కేటాయిస్తున్నారు. ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్‌ను అంతగా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.
- బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు 34 ఉండగా 8 వార్డెన్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఖాళీపోస్టులు ఉన్న వసతి గృహాలకు ఇతర హాస్టల్ వార్డెన్‌లు ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు.
- ఎస్టీ సంక్షేమ శాఖ 6 వసతి గహాలలో నాలుగు పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇక్కడ కూడా మరో హాస్టల్‌కు చెందిన వార్డెన్‌లు ఇన్ చా ర్జిగా కొనసాగుతున్నారు. ప్రతి హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్‌లను నియమిస్తేనే నియంత్రణ ఉంటుందని అంటున్నారు.

గతంలో అధికారుల నిద్ర..

జిల్లాలో గతంలో హాస్టళ్లలో ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు చేసేవారు. హాస్టల్లో రాత్రి నిద్ర చేసి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించేవారు. వార్డెన్‌లకు తగిన సూచనలు చేసేవారు. ఈ మేరకు జిల్లా అధికారులకు డివిజన్ వారీగా హాస్టలను కూడా కేటాయించారు. అంతేగాక ప్రత్యేక అధికారులను కూడా నియమించి హాస్టల్‌లపై పర్యవేక్షణ చేయించారు. ప్రస్తుతం ఈ వ్యవస్థ లేదు. హాస్టల్ వార్డెన్‌లు పట్టించుకోకపోగా, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేక వసతి గృహాల్లో విద్యార్థుల నియంత్రణ కరువైంది.

హాస్టల్స్‌లో పలు ఘటనలు

- రెంజల్ మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో సరైన భోజనం అందడం లేదని గత నెల రోజుల క్రితం విద్యార్థులు ఆందోళన చేశారు.
- నగరంలోని ఓ వసతి గృహం అధికారి ఇక్కడే ఉన్న వాచ్‌మన్‌కు బాధ్యతలు అప్పజెప్పి విధులను పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.
- గతంలో నగరంలోని బీసీ వసతి గృహంలోనూ విద్యార్థుల మధ్య ర్యాగింగ్ శ్రుతిమించి ఒకరినొకరు కొట్టుకున్న ఘటన జరిగింది. పోలీస్ స్టేషన్లో కూడా కేసు నమోదు కావడం గమనార్హం.
- నగరంలోని హమాల్‌వాడి వసతి గృహంలో విద్యార్థుల మధ్య గొడవలు జరిగి ఏకంగా హాస్టల్ వార్డెన్ పైనే దాడి చేశారు. పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది.
- నగరంలోని కోటగల్లీ వసతి గృహంలో వార్డెన్ స్థానికంగా ఉండడం లేదని ఫిర్యాదు రాగా అధికారులు విచారణ చేశారు. అయినా ఇక్కడ మార్పు రాలేదంటున్నారు.

వసతి గృహాలు	సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ	64	3500
బీసీ	34	2,200
ఎస్టీ	06	1500

తనిఖీలు చెయ్యాలి..



వసతి గృహాల్లో అధికారులు తరుచూ తనిఖీ చేయాలి. కొందరు వార్డెన్‌లు డుమ్మాలు కొట్టడంతో హాస్టల్‌ను పట్టించుకునే వారు ఉండటం లేదు. దీంతో విద్యార్థులు సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కఠిన చర్యలు తీసుకుంటాం..



వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. వసతి గృహంలో అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా వెళ్లి పోతే చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ కూడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

– శశికళ, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి

చనిపోయిన మేకలతో దళారుల వ్యాపారం

- స్థానికుల ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న పోలీసులు



చనిపోయిన మేక వద్ద స్థానికులు

నిజామాబాద్‌రూరల్: చనిపోయిన మేకలను విక్రయించేందుకు ప్రయత్నించిన దళారులను స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్ వద్ద గల చెరువు వద్ద నిత్యం వందలాది మేకల లారీలు ఆగుతుంటాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి మేకలను తరలించే లారీల యజమానులు మార్గమధ్యలో నాగ్‌పూర్ గేటు వద్ద ఆగి కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. లారీల నుంచి మేకలను దించి నీటిని తాగిస్తుంటారు. స్థానిక దళారులు కొందరు లారీల యజమానులతో బేరమాడి మేకలను కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తుంటారు. రోజులాగే సోమవారం ఉదయం కొన్ని మేకల లారీలు ఇక్కడ ఆగాయి. తరలిస్తున్న మేకలలో కొన్ని చనిపోగా వాటిని దూరంగా పారవేశారు. అయితే కొందరు దళారులు చనిపోయిన మేకలను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు దళారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల ప్రజలు మేక మాంసం కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చనిపోయిన మేక, గొర్రె మాంసం తింటే అనారోగ్యం పాలవుతారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయం ఉదయాన్నే వైరల్ కావడంతో మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అనధికారికంగా మేకల విక్రయాలు కొనసాగుతున్నాయని, అధికారులు స్పందించి దళారుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అజర్ బైజాన్‌లో అవస్థలు

- వలస కార్మికులను విజిట్ వీసాలపై పంపించిన ట్రావెల్స్ సంస్థ



రాంపల్లి జనార్దన్

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌కు చెందిన రాంపల్లి జనార్దన్ 20 రోజుల క్రితం అజర్ బైజాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ హోటల్‌లో క్లీనింగ్ పని చేయడానికి అవకాశం ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన ఒక ఏజెంటు చెబితే రూ.1.50 లక్షలు చెల్లించి పరాయి దేశానికి వలస వెళ్లాడు. వర్క్ వీసాకు బదులు విజిట్ వీసాపైనే జనార్దన్‌ను పంపించిన ఏజెంటు వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మించాడు. విజిట్ వీసాకు నెల రోజులే గడువు ఉంది. గడువు సమీపిస్తున్నా వర్క్ వీసా ఇప్పించకపోవడంతో అతను ఇంటినుంచి డబ్బులు జమ చేయించుకుని విమాన టిక్కెట్ కొనుగోలు చేసి రెండు రోజుల కింద ఇంటికి చేరుకున్నాడు. తాను సకాలంలో ఇంటికి వచ్చి ఉండకపోతే మన కరెన్సీలో రూ.30 వేలు జరిమానా చెల్లించాల్సి రావడంతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చేదని జనార్దన్ తెలిపారు. జనార్దన్‌తో పాటు నిర్మల్ జిల్లాకు చెందిన వెంకట్, వేములవాడకు చెందిన అజయ్‌లు వెళ్లగా వారు ఇంకా అక్కడే ఉన్నారు. వీరికి తోడుగా ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌కు చెందిన మరో 57 మంది అజర్‌బైజాన్‌లోనే ఉన్నారు. వీరికి వీసాల గడువు మరో నాలుగు రోజుల్లో ముగిసిపోనుంది. సకాలంలో వర్క్ వీసా లభించకపోయినా, లేదా ఇంటికి చేరుకోలేకపోతే తాము కూడా జరిమానా చెల్లించడంతో పాటు జైలు శిక్షను అనుభవించాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న ఒక ట్రావెల్స్ సంస్థ ద్వారా ఏజెంట్లు వలస కార్మికులను అజార్ బైజాన్‌కు తరలించారు. ఒక్కోక్కరి నుంచి వీసాల కోసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేశారు. అజార్ బైజాన్ దేశం నిబంధనలు కఠినంగా ఉండగా ఏజెంట్లు మాత్రం వలస కార్మికులను నమ్మించి గొంతు కోస్తున్నారు. వర్క్ వీసాలు ఇప్పించకుండా విజిట్ వీసాలు అంటగట్టి ఆటలాడుకుంటున్నారు. విదేశాంగ శాఖ స్పందించి అజర్ బైజాన్‌లో ఇరుక్కున్న తమ వారిని క్షేమంగా ఇంటికి చేర్పించాలని వలస కార్మికుల కుటుంబాలు కోరుతున్నాయి. వీసాలు ఇప్పించడంలో మోసం చేసిన ఏజెంట్లు, ట్రావెల్స్ సంస్థపైనా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

పోటెత్తిన దరఖాస్తులు!

- వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీకి విశేష స్పందన



పోస్టులు	ఖాళీలు	దరఖాస్తులు
స్టాఫ్‌నర్సులు	30	1340
డీఈవో	1	150
డీఈవో అకౌంటెంట్	3	74
ఎంబీబీఎస్- మేల్	3	3
ఎంబీబీఎస్- ఫిమేల్	8	9
ఫార్మసిస్టు	6	378
డెంటల్ టెక్నీషియన్	1	1
ఎంఎల్‌హెచ్‌పీ	43	139
ఆర్‌బీఎస్‌కే వైద్యులు	5	15

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానించగా అభ్యర్థుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఇలా ఏ ఉద్యోగం అయినా తీవ్రంగా పోటీ నెలకొంది. జిల్లాలో నిరుద్యోగులు అధిక మొత్తంలో ఉండడంతో ఏ నోటిఫికేషన్ వచ్చినా పోటాపోటీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. వైద్యారోగ్యశాఖ ఎంఎల్‌హెచ్‌పీ, ఎంబీబీఎస్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, డీఈవో, డీఈవో అకౌంటెంట్, జీఎస్‌ఎం, ఏఏఎం, డెంటల్ టెక్నిషియన్‌పోస్టుల ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. ఈ నెల 2 నుంచి 7వరకు కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దీంతో జిల్లా నలుమూలాల నుంచి పెద్ద ఎత్తున అర్హత ఉన్న నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. పోస్టులు పదుల సంఖ్యలో వందల్లో దరఖాస్తులు వచ్చాయి.

భర్తీ ప్రక్రియపై అనుమానాలు

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలోనే నియామకాలు చేపట్టనున్నారు. అయితే ఈ ప్రక్రియ ఏ విధంగా చేపడుతారోనని అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నాయి. మెరిట్ పద్ధతి ప్రకారమే పోస్టులు భర్తీ చేస్తామని అధికారులు చెబుతున్నా.. అభ్యర్థుల్లో మాత్రం లెక్క లెనన్ని అనుమాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో మెరిట్ పద్ధతి పేరు చెప్పి ఇష్టారాజ్యాంగా భర్తీ చేయడంతో కలెక్టర్ వరకు ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ సీరియస్ కావడంతో మళ్లీ ప్రక్రియను చేపట్టి న్యాయబద్ధంగా నియమకాలు జరిగేలా చొరవ చూపారు. ఇప్పుడు అధికారులు ఏలా భర్తీ చేస్తారరోని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తే అందరికి న్యాయం జరుగుతుందంటున్నారు.


మెరిట్ ప్రకారమే భర్తీ చేస్తాం..



అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. మెరిట్ పద్ధతిలోనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. విద్యార్హత, సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నాం. దరఖాస్తు గడువు సోమవారంతో ముగిసింది. అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దు. నియామకాల విషయంలో దళారులు, పైరవీకారులు, రికమండేషన్స్ అంగీకరించాం. దరఖాస్తుదారులకు పైరవీలకు సంబంధించిన సమాచారం తెలిస్తే మా కార్యాలయంలో తెలియజేయాలి. – సుదర్శనం, డీఎంహెచ్‌వో

లక్ష్మి ఎత్తిపోసేనా!

- కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద తగ్గుతున్న నీటి మట్టం
- మరో మూడు అడుగులు తగ్గితే అందని నీరు
- కాలువకు నీటి సరఫరా చేయాలంటే లిఫ్ట్ అవసరం
- లిఫ్ట్‌కు విద్యుత్ సమస్య
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



ప్రాజెక్టులో లక్ష్మి లిఫ్ట్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. దీంతో లిఫ్ట్ ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా చేపట్టాల్సి ఉంటుంది. కానీ అధికారులు లిఫ్ట్‌ను ఇంకా సిద్ధం చేయకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి లక్ష్మికాలువ ద్వారా 1064 అడుగుల నీటి మట్టం వరకు మాత్రమే నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1067 అడుగుల నీటి మట్టం ఉంది. మరో మూడు అడుగులు తగ్గితే లక్ష్మి కాలువ ద్వారా నీటి సరఫరా జరగదు. ప్రస్తుతం ప్రతి రోజు 9367 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. సుమారుగా రోజుకు 0.8 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు. దీంతో లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ ఎత్తిపోవడానికి ఎన్నో రోజులు పట్టేలా లేదు. కానీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు లక్ష్మి కాలువకు నీటి సరఫర చేసే ప్రాజెక్ట్‌లోని లక్ష్మి ఎత్తిపోతల పథకంను సిద్ధం చేయలేదు. లక్ష్మి లిఫ్ట్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లు చెడిపోవడంతో విద్యుత్ సమస్య నెలకొంది.

పంటలను కాపాడటానికి..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 1064 అడుగుల నీటి మట్టం వరకు మాత్రమే లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల సాధ్యం అవుతుంది. ప్రతి సంవత్సరం యాసంగిలో పంటలు చేతికందే సమయంలో నీరందక ఎండిపోయేవి. దీంతో 2007లో ప్రాజెక్ట్‌లో 1045 అడుగు నీటి మట్టం వద్ద లక్ష్మికాలువకు నీటి సరఫరా చేయడం కోసం రూ.25 కోట్ల నిధులతో లిఫ్ట్ పనులు ప్రారంభించారు. పనులు ఆగుతు.. సాగుతు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు నాటికి పూర్తయింది. కానీ 2015లో ప్రాజెక్ట్‌లో ఎగువ ప్రాంతాల నుంచి చుక్క నీరు రాక పోవడంతో ఆ ఏడాది ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టలేదు. 2016లో ప్రాజెక్ట్‌లోకి భారీ వరదలు రావడంతో యసంగి సీజన్ వరకు ప్రాజెక్ట్ నీటి మట్టం నిండుకుండలా ఉండటంతో లిఫ్ట్ అవసరం రాలేదు. 2017లో తొలిసారిగా లక్ష్మి లిఫ్ట్ ద్వారా ఆయకట్టుకు నీరు అందించారు. 2018లో కూడా లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తిపోసి లక్ష్మి కాలువ ద్వారా సరఫరా చేపట్టారు. అప్పటి నుంచి ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు వచ్చి యాసంగి ప్రారంభం వరకు నిండుకుండల ఉండటంతో లిఫ్ట్ ద్వారా ఎత్తిపోసే అవసరం రాలేదు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి మట్టం వేగంగా తగ్గడం, నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ ఎత్తిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో లిఫ్ట్‌ను ప్రారంభించాల్సి వస్తుంది.



లక్ష్మికాలువ హెడ్ రెగ్యులేటర్

50 వేల ఎకరాల ఆయకట్టు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రధాన కాలువ ఆయకట్టు 25 వేల ఎకరాలు కాగా కాలువ ఆధారంగా నిర్మించిన లిఫ్ట్‌ల ద్వారా నీరు అందే ఆయకట్టు 25 వేల ఎకరాలు ఉంది. లక్ష్మి కాలువ డీ–3 ఆధారంగా వేంపల్లి, బోదేపల్లి, నవాబు లిఫ్టులు, డీ–4 కాలువ ఆధారంగా చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలు నిర్మించారు.

పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్లు

లక్ష్మి లిఫ్ట్ ద్వారా 2017, 2018లో కాలువలోకి నీటిని ఎత్తిపోశారు. అయితే లిఫ్ట్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఎత్తిపోతల పథకాన్ని ఎస్సారెస్పీ అధికారులకు అప్పగించలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లిఫ్ట్ అవసరం రాలేదు. కానీ నీటిపారుదల శాఖ విభజన జరగడంతో లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల, నిర్వహణ ఎస్సారెస్పీ అధికారుల నుంచి మైనర్ ఇరిగేషన్‌కు వెళ్లిపోయింది. ఆ శాఖ అధికారులు మరోసారి లిఫ్ట్ ట్రయల్ రన్ చేస్తేను తమ ఆధీనంలోకి తీసుకుంటామని చెబుతున్నారు. అయితే లిఫ్ట్‌కు విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. 15 ఏళ్ల నాటి పనులను ఇంకెన్నాళ్లు చేపట్టాలని కాంట్రాక్ట్ కంపెనీలు చేతులు ఎత్తేశాయి. దీంతో లిఫ్ట్‌పై పంచాయతీ నెలకొంది. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విద్యుత్ సరఫరా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీటి సరఫరా చేపడుతాం

లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ ఎత్తిపోయే నాటికి లిఫ్ట్ ద్వారా నీటి సరఫరా చేపడుతాం. ఉన్నతాధికారులు సంబంధిత ఏజెన్సీతో చర్చలు జరుపుతున్నారు. పంటలు ఎండిపోయే ప్రమాదం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

– శేఖర్‌బాబు, ఏఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

క్లుప్తంగా

ట్రాఫిక్‌ సిబ్బందికి కళ్లద్దాల పంపిణీ



ఖలీల్‌వాడి: ఎండలో సైతం విధులు నిర్వర్తించే ట్రాఫిక్‌ సిబ్బందికి కళ్లద్దాలు, వెంట వాటర్‌బాటిళ్లు ముఖ్యమని పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌ అన్నారు. నగరంలోని మోక్ష ఫ్యాషన్స్‌ ఆధ్వర్యంలో అందజేసిన కళ్లద్దాలు, వాటర్‌ బాటిళ్లను కమిషనరేట్‌ కార్యాలయంలో ట్రాఫిక్‌సిబ్బందికి సీపీ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందికి ఎటువంటి అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళ్లద్దాలు, వాటర్‌బాటిళ్లు అందించిన మోక్ష్‌ ఫ్యాషన్స్‌ ప్రొప్రైటర్‌ గాదె ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు. ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, ఎస్బీ అధికారి శ్రీశైలం, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్‌ పరీక్షలు

- ఒకరిపై మాల్‌ప్రాక్టీస్‌ కేసు నమోదు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌మొదటి సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన మొదటి సంవత్సరం అర్థశాస్త్రం, భౌతికశాస్త్రం పరీక్షలకు మొత్తం 19,454 మందికి గాను 18613 మంది హాజరుకాగా, 841 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నవీపేట మోడల్‌ కళాశాల సెంటర్‌లో ఓ విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్‌ కేసు నమోదైనట్లు జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రఘురాజ్‌ తెలిపారు. 57 పరీక్షాకేంద్రాలకు గాను 50 కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేశారు.

మహిళా రిజర్వేషన్‌ అమలు చేయాలి



నిజామాబాద్‌రూరల్‌: మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ అమలుచేయాలని జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జీఆర్‌ఎం సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్లమ్మగుట్ట మున్నూరుకాపు సంఘంలో సోమవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ, క్యారం, ముగ్గుల పోటీల విజేతలకు ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్‌ బహుమతులు అందజేశారు. పలువురు మహిళలను సన్మానించారు. అంతకు ముందు విఠల్‌రావును సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జీఆర్‌ఎం సొసైటీ సభ్యులు, ఆక్స్‌ఫర్డ్‌ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 95 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, ట్రెయినీ ఐఏఎస్‌ కిరణ్మయి

సుభాష్‌నగర్‌: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 95 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలను వివరిస్తూ అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, కార్పొరేషన్‌ కమిషనర్‌ మకరందు, ట్రెయినీ ఐఏఎస్‌ కిరణ్మయికి అర్జీలు అందజేశారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలి

మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకుల పెండింగ్‌ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాది నవంబర్‌ నుంచి మధ్యాహ్నభోజన కార్మికులకు గౌరవ వేతనం, అల్పాహారం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అప్పులు చేసి ఏజెన్సీలను నిర్వహిస్తున్నారని, గౌరవ వేతనం రూ.2వేలకు పెంచినప్పటికీ సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్‌ చేశారు.

జేజే డెవలపర్స్‌పై చర్యలు తీసుకోవాలి

నగరశివారులోని పాంగ్రా, డిచ్‌పల్లి మండలంలోని బర్ధీపూర్‌ శివార్లలో ప్లాట్లు విక్రయించి రిజిస్ట్రేషన్‌ చేయకుండా ఇబ్బందులు పెడుతున్న జేజే డెవలపర్స్‌, ఫైనాన్షియర్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. తామంతా కలిసి దాదపు రూ.10 కోట్లు చెల్లించామని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌ విషయమై ప్రశ్నించేందుకు వారం క్రితం ఇందూరు అవని వెంచర్‌కు తాము వెళ్తే.. ఏం ఇచ్చేది లేదని గుండాలతో బయటికి గెంటేశారని, తమకు న్యాయం చేయాలని కోరారు.

మా కుటుంబాన్ని వేధిస్తున్నారు



తమ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించడంతోపాటు భూమిని కబ్జా చేసి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆలూరు మండలకేంద్రానికి చెందిన ఇస్సాపల్లి సుమలతతోపాటు ఆమె కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌కు తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. తమకు గ్రామ శివారులో 4.20 గుంటల భూమి ఉందని, అదే సర్వే నెంబర్‌లో మగ్గిడి గంగారెడ్డికి భూమి ఉండడంతో సర్వేనెంబర్‌ను ఇచ్చేయాలని ఒత్తిడి తెస్తే తాము ఒప్పుకోలేదన్నారు. గంగారెడ్డి తమ కులంపై ఒత్తిడి తెచ్చి కుల బహిష్కరణ చేయించారని రోదించారు. మరోవైపు గ్రామానికి చెందిన గడ్డం యశోద తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా, కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కోర్టు ఇంజెక్షన్‌ ఆర్డర్‌ ఇచ్చినప్పటికీ తాము లేని సమయంలో భూమి దున్నారని, ప్రశ్నిస్తే దాడి చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల బహిష్కరణ ఎత్తివేయడంతోపాటు యశోద నుంచి తమ భూమిని ఇప్పించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి పూలాభిషేకం



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడాన్ని హర్షిస్తూ ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షుడు ద్యారంగుల కృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మల్యాల గోవర్దన్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని, అంతకు ముందు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం దుబ్బ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

మరోసారి మోదీ ప్రధాని కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్‌

నందిపేట్‌ (ఆర్మూర్‌): దేశ భవిష్యత్‌ కోసం నరేంద్ర మోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణమండపంలో 'టిఫిన్‌ బైఠక్‌' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిపేట్‌, డొంకేశ్వర్‌ మండలాల బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొన్నారు. ఎంపీతోపాటు ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. పార్టీ మండల అధ్యక్షుడు భూతం సాయిరెడ్డి, సాయికుమార్‌, పటేళ్ల రాజు, ఎంపీటీసీ రాజు, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నాగ సురేశ్‌, మాజీ ఎంపీటీసీ గాండ్ల నర్సాగౌడ్‌, కొండాపురం భోజన్న, గంగాధర్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, కస్తూరి గంగాధర్‌, గుండ్ల ముత్యం, కొత్తూర్‌ మాజీ సర్పంచ్‌ సాయాగౌడ్‌, గడ్డం చిన్నారెడ్డి, దమ్మాయి సుధాకర్‌, వడ్ల భోజన్న, భాగ్యమ్మ, ఎర్రం లింగం, ప్రశాంత్‌, చింత శ్రీనివాస్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీకి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన హాకీ క్రీడాకారిణులు దార్ల ప్రీతి, మమత, శ్రీచందన జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. పుణేలో ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న 14వ హాకీ ఇండియా సీనియర్‌ ఉమెన్‌ నేషనల్‌ ఛాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. క్రీడాకారిణులను హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణతో పాటు ఉపాధ్యక్షుడు టి విద్యాసాగర్‌రెడ్డి, కోశాధికారి పింజ సురేందర్‌, సభ్యులు తదితరులు అభినందించారు.

రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి



బాన్సువాడ : పీఎం కిసాన్‌ సమ్మాన్‌ నిధికి సంబంధించి ఈ కేవైసీని రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని బీర్కూర్‌ సీనియర్‌ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్‌ అన్నారు. సోమవారం రైతు వేదికలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డుకు మొబైల్‌ నంబర్‌, బ్యాంక్‌ అకౌంట్‌ అనుసంధానం చేసుకుంటేనే 15, 16వ విడతల పీఎం కిసాన్‌ సమ్మాన్‌ నిధి డబ్బులు జమవుతాయన్నారు.

రంజాన్‌ గ్రీవెన్స్‌ సెల్‌ ఏర్పాటు

కామారెడ్డి అర్బన్‌ : రంజాన్‌ మాసం సందర్భంగా నెలరోజులపాటు ఏవైనా సమస్యలు ఎదురైతే ముస్లింలు కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌ను సంప్రదించాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ 93982 35585, 90102 61667 నంబర్ల ను సంప్రదించవచ్చన్నారు.

అవుట్‌లెట్లపై ప్రజలకు నమ్మకం

- పోలీస్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఫిల్లింగ్‌ స్టేషన్‌ను ప్రారంభించిన కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ



కారులో డీజిల్‌ పంప్‌ చేస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, పక్కన సీపీ కల్మేశ్వర్‌

ఖలీల్‌వాడి: ప్రైవేట్‌ పెట్రోల్‌ పంపులతో పోలిస్తే ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో నడిపే అవుట్‌లెట్లపై ప్రజలకు నమ్మకం ఉంటుందని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా కేంద్రంలో పోలీస్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ ఫిల్లింగ్‌ స్టేషన్‌ను కలెక్టర్‌ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవుట్‌ లెట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిల్లింగ్‌ స్టేషన్‌ ద్వారా వచ్చే లాభాలను పోలీసు కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తామని సీపీ కల్మేశ్వర్‌ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మొదటి పెట్రోల్‌పంప్‌ అని ఐవోసీ సీజీఎం శుభ్రత్‌ రత్‌ అన్నారు. పోలీసు, జైళ్ల తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అవుట్‌లెట్లపై ప్రజలు పూర్తి నమ్మకం ఉందని, లాభాల్లో నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఐపీఎస్‌ బి చైతన్యరెడ్డి, సీనియర్‌ మేనేజర్‌ మోహన్‌కిశోర్‌, నిజామాబాద్‌, ఆర్మూర్‌ ఏసీపీలు రాజావెంకట్‌ రెడ్డి, నాగయ్య, నిజామాబాద్‌ ఐవోసీఎల్‌ ఆఫీసర్‌ క్రాంతికుమార్‌, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్‌ హైవే అయితే మాకేంటి?

దేశంలోనే ప్రధానమైన జాతీయ రహదారి 44పై రైతులు పంట దిగుబడులను ఆరబోస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కశ్మీర్‌ – కన్యాకుమారిని కలిపే నేషనల్‌ హైవేపై ప్రతిరోజూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి బిజీ రోడ్డుపై పంటదిగుబడులను ఆరబోస్తుండడంతో దూర ప్రయాణికులతోపాటు స్థానికులు ప్రమాదాలబారిన పడుతున్నారు.



శ్రీరాంపూర్‌ వద్ద జాతీయ రహదారిపై ఆరబోసిన మక్కలు

- జాతీయ రహదారిపై పంట దిగుబడుల ఆరబోత
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు

బాల్కొండ: పంట దిగుబడులను ఆరబోసేందుకు ఏ రోడ్డయితే మాకేంటి? అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు రైతులు. ఏకంగా జాతీయ రహదారి 44పై బాల్కొండ మండలం శ్రీరాంపూర్‌ నుంచి మెండోరా మండలం దూదిగాం వరకు మక్కలను ఆరబోస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఈ ప్రాంతానికి రాగానే వాహనాలను అదుపు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలబారిన పడుతున్నారు. గతంలో జొన్నలను ఆరబోసిన కారణంగా గ్రామీణ రోడ్లపై పలువురు ప్రయాణికులు ప్రమాదాలబారినపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. జాతీయ రహదారిపై కూడా ప్రమాదాలు సంభవించాయి. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల రాకపోకలతో ఎంతో బిజీగా ఉండే నేషనల్‌ హైవే ఇదేం పరిస్థితి? అని ఆయా రాష్ట్రాలకు చెందిన వాహనదారులు వాపోతున్నారు. పంట దిగుబడులను సులువుగా ఆరబోసేందుకు అలవాటు పడిన రైతులు ఎక్కడ తారు రోడ్డు కనిపిస్తే అక్కడ ఆరబోస్తున్నారు.

పల్లె రోడ్లపై నిండుగా..

పల్లెల్లోని తారు రోడ్లు ఎక్కడా ఖాళీ కనిపించడం లేదు. రోడ్లపై ఎటుచూసినా పంటదిగుబడులు ఆరబోసి కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముప్కాల్‌ మండలం పెద్ద వాగు రోడ్డుపై గత 20 రోజుల క్రితం జొన్నలు రోడ్డుపై ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని యువకుడు మృత్యువాతపడ్డాడు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

కేసులు నమోదు చేస్తాం

పంట దిగుబడులను రోడ్లపై ఆరబోస్తే కేసులు నమోదు చేస్తాం. ఇది వరకే పలు మార్లు హెచ్చరించాం. అయినప్పటికీ మార్పు లేకపోతే ఉన్నతాధికారుల అనుమతితో కేసులు నమోదు చేస్తాం. పంటదిగుబడులు ఆరబోసే విషయంలో రైతులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

– గోపి, ఎస్సై, బాల్కొండ

ప్రారంభానికి నోచుకోని కస్తూర్బా

- పనులు ప్రారంభమై మూడేళ్లు పూర్తి
- ఇంకా అసంపూర్తిగానే నిర్మాణం
- అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు



కస్తూర్బా పాఠశాల భవనం

మోర్తాడ్‌: ఏర్గట్ల మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమై మూడేళ్లు పూర్తయినా ఇంకా అసంపూర్తిగానే ఉంది. పాఠశాలను ప్రస్తుతం అద్దె ఇంట్లో కొనసాగిస్తున్నారు. అరకొర వసతుల కారణంగా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమగ్రి శిక్ష కార్యక్రమం కింద పాఠశాల, వసతి గృహం నిర్మాణ పనులను రూ.3.35 కోట్ల వ్యయంతో చేపట్టగా, 2021 జనవరిలో అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డి పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులు పూర్తికాగా రంగులువేయించారు. అయితే, విద్యుత్‌ సరఫరాతోపాటు చిన్నచిన్న పనులు పూర్తికాకపోవడంతో భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సొంత భవనం వినియోగంలోకి వస్తే పదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఇంటర్‌ కూడా ఇక్కడే చదువుకోవడానికి అవకాశం కలుగుతుంది. జిల్లాలోని వివిధ కస్తూర్బా పాఠశాలల్లో ఇప్పటికే ఇంటర్‌ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏర్గట్లలో జూనియర్‌ కళాశాల లేకపోవడంతో కస్తూర్బా పాఠశాలలో ఇంటర్‌ కోర్సులను చేర్చితే పరిసర గ్రామాల విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పనులను పూర్తి చేయించి కస్తూర్బా పాఠశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

తిమ్మాపూర్‌లో కుస్తీ పోటీలు



ఎల్లారెడ్డి : మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామంలో సోమవారం కుస్తీ పోటీలను ఘనంగా ని ర్వహించారు.మహాశివరాత్రి ఉత్సవాల్లో భా గంగా కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పో టీలకు చుట్టు పక్కల మండలాలకు చెందిన మ ల్లయోధులు కుస్తీ పట్టారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్‌, అరవింద్‌, శ్రీనివాస్‌గౌడ్‌ ఉన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

- ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణం

కామారెడ్డి టౌన్‌: ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలికను జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు సోమవారం ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బాన్సువాడ పట్టణానికి చెందిన 12 ఏళ్ల బాలిక బాన్సువాడ నుంచి కామారెడ్డి రూట్‌లో స్కూల్‌ డ్రెస్‌ బ్యాగు వేసుకుని ఉదయం 10 గంటలకు బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తోంది. అదే బస్సులో ప్రయాణిస్తున్న బాలల పరిరక్షణ విభాగా సిబ్బంది ఖాలేద్‌ ఆమెను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆధార్‌ కార్డును పరిశీలించారు. వెంటనే బాన్సువాడ పట్టణ అంగన్‌వాడీ టీచర్‌కు సమాచారం అందించి బాలికను జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయానికి తీసుకువచ్చారు. జిల్లా అధికారి జే స్రవంతి బాలికకు కౌన్సిలింగ్‌ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- వేర్వేరు గ్రామాల్లో ఇల్లు, గుడిసె దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాయంపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా రెండు ఇళ్లు దగ్ధమైనట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ బాలయ్య తెలిపారు. బాయంపల్లికి చెందిన కండ్లపల్లి సాయన్న ఇంట్లో వంట సామగ్రి, దుస్తులు, వ్యవసాయ పనిముట్లతో పాటు ఇతర సామగ్రి కాలిపోయి రూ.2.46 లక్షల ఆస్తి నష్టంవాటిల్లిందన్నారు. సజ్జన్‌పల్లిలోనీల పోచయ్యకు చెందిన నివాసపు గుడిసె కాలిపోవడంతో రూ.46వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు వివరించారు. పంచనామా చేసినట్లు ఆర్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ముగ్గురు ఉరేసుకోగా, గత గురువారం గడ్డి మందు సేవించిన ఒకరు పరిస్థితి విషమించి మృతి చెందారు.

- మద్యానికి బానిసై ఇద్దరు
- ఆర్థిక ఇబ్బందుల కారణంగా మరో ఇద్దరు



అశోక్‌ (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన దాసరి గోపి (36) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మద్యానికి బానిసకావడం, అప్పులబాధ కారణంగా గోపి ఇంటి పక్కన ఉన్న చేదబావికి ఏర్పాటు చేసిన గిరక దుంగకు తాడుతో ఉరేసుకున్నాడన్నారు. మృతుడు తాపీమేస్త్రిగా పని చేసేవాడని, భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

చిక్కడపల్లిలో..



శంకర్‌ (ఫైల్‌)

రుద్రూర్‌: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండలంలోని చిక్కడపల్లికి చెందిన మచ్కూరి శంకర్‌ (38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై మహేందర్‌ తెలిపారు. కుటుంబ అవసరాల కోసం గత మూడేళ్లుగా అప్పులు చేస్తున్న శంకర్‌.. చివరి అవి తీర్చే మార్గం కనిపించక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడన్నారు. మృతుడి భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జైతాపూర్‌లో..

ఎడపల్లి (బోధన్‌) : అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండలంలోని జైతాపూర్‌ గ్రామానికి చెందిన మాతంగి సాయిలు (54) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. గ్రామపంచాయతీ పార్కులో ఎవరూ లేనిసమయంలో మధ్యాహ్నం సమయంలో చెట్టుకు ఉరేసుకున్నాడని, మృతుడి భార్య మాతంగి గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జప్తిజాన్కంపల్లిలో..



రామకిష్టయ్య(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జప్తిజాన్కంపల్లికి చెందిన చిన్నన్న రామకిష్టయ్య(51) అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 7వ తేదీన ఇంటి వద్ద కిష్టయ్య గడ్డి మందు సేవించగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి వైద్యుల సూచన మేరకు సోమవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా కిష్టయ్య మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హైవేపై ఆటో బోల్తా

- తొమ్మిదిమందికి గాయాలు



నిజామాబాద్‌ రూరల్‌(డిచ్‌పల్లి): డిచ్‌పల్లి మండలం సాంపల్లి పరిధిలోని 44వ నంబర్‌ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిందని ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఈ ఘటనలో తొమ్మిది మందికి గాయాలయ్యాయన్నారు. ఆర్మూర్‌ నుంచి డిచ్‌పల్లి వైపు వస్తుండగా ప్యాసింజర్‌ ఆటోను డ్రైవర్‌ సలీం అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో బోల్తా పడిందన్నారు. గాయాలపాలైన తొమ్మిదిమందిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గ్రామీణ బ్యాంకులో చోరీకి యత్నం

- సైరన్‌ మోగడంతో పరారైన దొంగలు



దుండగులు తొలగించిన కిటికీ

ఆర్మూర్‌టౌన్‌: మండలం పిప్రిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దుండగులు చోరీకి యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి బ్యాంకు కిటికీని తొలగించిన ఇద్దరు దుండగులు లోనికి ప్రవేశించారు. లాకర్‌ను ధ్వంసం చేస్తుండగా, సైరన్‌ మోగడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు డయల్‌ 100కు సమాచారం అందించగా, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి ఇద్దరు దుండగులు చోరీకి యత్నించినట్లు గుర్తించారు. బ్యాంక్‌ మేనేజర్‌ రాజేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సారంగాపూర్‌ వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని సారంగాపూర్‌కు చెందిన రాథోడ్‌ రామారావుగా గుర్తించామని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ప్రభుత్వ టీచర్‌ ..



నాగ్‌నాథ్‌ అప్ప (ఫైల్‌)

మద్నూర్‌(జుక్కల్‌): మద్నూర్‌ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగ్‌నాథ్‌ అప్ప(50) సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు సహఉపాధ్యాయులు తెలిపారు. మండలంలోని మేనూర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగ్‌నాథ్‌ సోమవారం ఉదయం తన పిల్లలను బైక్‌పై స్కూల్‌ వద్ద దింపి తిరిగి వస్తుండగా, రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే మద్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా,అక్కడ సీపీఆర్‌ చేసి దెగ్లూర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. నాగ్‌నాథ్‌ మృతిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.మృతుడికిభార్య,కూతురు,కొడుకు ఉన్నారు.

పట్టుబడ్డ బియ్యం 1432 క్వింటాళ్లు

వేల్పూర్‌: మండల కేంద్రంలోని వజ్ర రైస్‌మిల్లులో పట్టుబడిన బియ్యం మొత్తం 1432 క్వింటాళ్లు ఉందని ఎస్సై వినయ్‌కుమార్‌ సోమవారం తెలిపారు. వజ్ర రైసుమిల్లులో శనివారం అర్ధరాత్రి పట్టుకున్న రెండు లారీల లోడ్‌ బియ్యంతో పాటు అక్కడ నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సంచుల్లో నింపిన తరువాత అక్లూర్‌ సమీపంలోని సాయికృష్ణ రైస్‌మిల్లుకు తరలించే సరికి ఆదివారం అర్ధరాత్రి దాటినట్లు సమాచారం. పట్టుబడిన బియ్యం మొత్తం తూకం వేయగా 1432 క్వింటాళ్లు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

ఎల్లారెడ్డి: అదనపు కట్నం కోసం వేధించిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ సోమవారం తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని మత్తమాల గ్రామానికి చెందిన పెద్దగొళ్ల సుగుణకు 25 ఏళ్ల క్రితం మెదక్‌ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లయ్యతో వివాహమైంది.సుగుణకు సంతానం కలగక పోవడంతో 15 ఏళ్ల క్రితం మంజూల అనే మహిళను మల్లయ్య రెండో వివాహం చేసుకున్నాడు. అదనపు కట్నం కోసం మొదటి భార్య సుగణను వేధిస్తుండడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్లయ్యతోపాటు మంజులపై గృహహింస, వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.